సాక్షి వికారాబాద్

బుధవారం, 1, మే, 2024



కాసానిని గెలిపిద్దాం

లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిద్దామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. 8లో▸



మోదీ పాలనలో..

పదేళ్ల మోదీ పాలనలో దేశం అథోగతి పాలయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేశ్ ఆరోపించారు. 8లో▸




బీజేపీతోనే సుభిక్ష పాలన

బీజేపీతోనే సుభిక్షమైన పాలన సాధ్యమని ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యారెడ్డి అన్నారు. 9లో▸

మళ్లీ మనమే లాస్ట్

'పది'లో గత ఏడాది ఫలితాలే పునరావృతం

- 33వ స్థానంలో నిలిచిన జిల్లా
- పరీక్షలకు హాజరైన విద్యార్థులు 13,357
- ఉత్తీర్ణులు 8,695మంది
- ఫెయిల్ అయిన విద్యార్థులు 4,662 మంది



వికారాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లా చివరి స్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాలే పునరావృతం అయ్యాయి. జిల్లా 33వ స్థానంతో సరిపెట్టుకుంది. గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా కనిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 64 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారు. ఇందులో అత్యధికంగా పరిగిలోని కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌కు చెందిన 10 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారు.

65.10 శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని 20 మండలాల నుంచి 13,357 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 8,695 మంది ఉత్తీర్ణులయ్యారు. మరో 4,262 మంది ఫెయిల్ అయ్యారు. ఓవరాల్‌గా 65.10శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 72.82 శాతంతో బాలికలు పైచేయి మొదటి స్థానంలో నిలవగా.. 57.34 శాతంతో బాలురు అట్టడుగున నిలిచారు.

64మందికి పదికి పది జీపీఏ

వికారాబాద్ మండలం 80శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలవగా.. 78 శాతంతో పరిగి తరువాత స్థానంలో ఉంది. గతేడాది మొదటి స్థానంలో నిలిచిన

చౌడాపూర్ మండలం

ఈ సారి 37 శాతంతో అట్టడుగున నిలిచింది. బషీరాబాద్ మండలంలో సైతం 42 శాతంతో అత్తెసరు ఫలితాలే వచ్చాయి. జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 97 శాతం, సోషల్ వెల్ఫేర్ పాఠశాల ల్లో 90శాతం, ఆర్‌ఈఎస్ పాఠశాలల్లో 98 శాతం, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 94 శాతంతో మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలు 46 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలలు 48 శాతం ఫలితాలతో బాగా వెనుకబడి పోయాయి. గతే డాది జిల్లాలో 33 మంది మాత్రమే 10 జీపీఏ సాధించగా ఈ సారి 64 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. అయితే జిల్లాలో ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలో వందకు వందశాతం ఉత్తీర్ణత నమోదు కాకపోవటం గమనార్హం.

జిల్లాలో 10జీపీఏ సాధించిన ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులు వీరే..

బంట్వారం మండలం టీఎస్ డబ్ల్యూఆర్ఎస్‌కు చెందిన వైష్ణవికి 10 జీపీఏ గ్రేడ్ వచ్చింది. పరిగి మండలం మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన అభిరాంకీకి 10జీపీఏ, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలకు చెదిన మీనాక్షికి 10జీపీఏ, కొడంగల్ మండలం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన సుగేందర్‌కు 10 జీపీఏ, గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన హరిచంద్‌కు 10 జీపీఏ, మోమిన్‌పేట మండలం మేకవనంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు నీతిక, సంజనకు 10 జీపీఏ, మర్పల్లి మండలం మోడల్ స్కూల్‌కు చెందిన అనుష్క 10జీపీఏ గ్రేడ్ సాధించారు.

ఆశించిన ఫలితాలు రాలేదు



గత ఏడాదిలాగే ఈ సారి కూడా జిల్లా పదో తరగతి ఫలితాల్లో చివరి స్థానంలో నిలిచింది. అయితే కాస్త మెరుగైన ఫలితాలు వచ్చాయి. గతేడాది 59శాతం రాగా.. ఈ ఏడాది 65శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. తాము ఆశించిన ఫలితాలు రాలేదు. ఉపాధ్యాయులు కష్టపడినప్పటికీ ఫలితాలు నిరాశపరిచాయి. ఈ ఫలితాలను బేరీజు వేసుకొని సప్లిమెంటరీలో వందశాతం కోసం కృషి చేస్తాం. ఏయే సబ్జెక్టుల్లో, ఏయే పాఠశాలల్లో తక్కువ ఫలితాలు వచ్చాయో సమీక్షించుకొని సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే వారికోసం ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని భావిస్తున్నారం. ఉత్తీర్ణులైన వారందరికీ అభినందనలు.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- హామీలతో ప్రజలను మోసం చేసింది
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి
- బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించాలని పిలుపు

దోమ: ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి సబితారెడ్డి ఆరోపించారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించారు. ఈ సభకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ స్వామిగౌడ్, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలను నమ్మరాదని సూచించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ ఎంపీపీ రాజగోపాలా చారి, కో ఆప్షన్ సభ్యులు ఖజాపాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ఎంపీటీసీ రాములు పాల్గొన్నారు.

క్షణికావేశంలో జీవితాన్ని జైలుపాలు చేసుకోరాదు

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: క్షణికావేశంలో జీవితాన్ని జైలుపాలు చేసుకోరాదని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి తాండూరులోని ఎన్టీఆర్ నగర్‌లో పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న బకాయి చలాన్లను వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై ప్రజలు అవగాహన ఉండాలన్నారు. అకారణంగా ఆవేశానికి లోనై కేసుల్లో ఇరుక్కోరాదని సూచించారు. చిన్న సమస్యలు ఉంటే రాజీ చేసుకోవాలే తప్ప గొడవ పడరాదన్నారు. కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇన్‌చార్జ్‌లను నియమించండి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ సెగ్మెంట్లలోని ప్రతి పోలింగ్ కేంద్రానికి ఇన్‌చార్జ్ అధికారులను నియమించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు రోజు విధులకు హాజరయ్యే సిబ్బందికి వసతి కల్పించాలని సూచించారు. 13వ తేదీ ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈవీఎంపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు.

కూలీలకు పనులు కల్పించాలి

గ్రామాల్లో ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయమే పనులు ప్రారంభించి మధ్యాహ్నంలోగా ఇళ్లకు చేరేలా చూడాలని సూచించారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీటి తడులు పెట్టాలని ఆదేశించారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, డీపీఓ జయసుధ, డీఆర్‌డీఏ శ్రీనివాస్ , ఎంపీడీఓలు, ఏపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, ఉద్యోగులు తప్పనిసరిగా వారి ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన ఉండాలన్నారు. మీ నియోజకవర్గానికి సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓటు వేయాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ వీరకాంతం పాల్గొన్నారు.

బీజేపీతోనే రైతు సంక్షేమం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశంలో బీజేపీ ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేవెళ్ల లోక్‌సభ స్థాయిలో రైతు సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు జంగయ్యగౌడ్, మారుతీకిరణ్, అంజయ్య యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్, కంజర్ల ప్రకాశ్, ప్రేమ్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతులను ధనికులను చేయాలనే ఆలోచనతో ప్రధాని మోదీ అనేక పథకాలు చేపట్టారని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కృషి సించాయ్ యోజన, ఫసల్‌బీమా యోజన వంటి పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు జక్కా రవీందర్ రెడ్డి, సుదర్శన్ జంగారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

- రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- రంజిత్‌రెడ్డిని గెలిపించాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మోమిన్‌పేటలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ముగిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపు రూ.2 లక్షల రైతు రుణ మాఫీని ఒకే విడతలో అమలు చేస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని ఫాం హౌస్‌కు పరిమితం చేశారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. పేదలకు రాజ్యాంగం కల్పిస్తున్న రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, సురేందర్, మహేందర్‌రెడ్డి, సుభాష్ గౌడ్, మహంత్ స్వామి, సిరాజొద్దీన్, చంద్రయ్య, వేమారెడ్డి, మాణయ్య, మల్లయ్య, సుభాష్, నర్సింలు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో పనిచేయండి

మల్టీ జోన్ –2 ఐజీ సుధీర్‌బాబు




పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ సుధీర్‌బాబు

అనంతగిరి: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతోపాటు సమయస్ఫూర్తితో పనిచేయాలని మల్టీ జోన్ –2 ఐజీ సుధీర్‌బాబు సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయాన్ని, టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం, డబ్బు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా చూడాలని, రౌడీ షీటర్లు, అనుమానితులపై నిఘా పెట్టాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రుణమాఫీ

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రూ. 70వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిజాంపేట్ మేడిపల్లి, చింతలపల్లి, కంకల్, మేడిపల్లికాలాన్, మిట్టకంకల్, కడ్మూరు, చన్గోముల్, బార్లపల్లి, రేగడి మామిడిపల్లి, పెద్ద ఉమ్మెంతాల్, రాకంచర్ల, తిర్మలాపూర్ గ్రామాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాలు లేవు, నిధులు, నీళ్లు లేవు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. మాయ మాటలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎంపీ ఎన్నికల తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15వ తేదీ లోపు రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, షకీల్, శ్రీనివాస్‌గుప్తా, పెంటయ్య, శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ ఎంపీపీ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



చన్గోముల్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

న్యూస్‌రీల్

నాణ్యమైన సిమెంట్ అందిస్తాం

సీసీఐ ఫ్యాక్టరీ సీఎండీ సంజయ్‌బంగా



కోల్డ్‌షెడ్లను ప్రారంభిస్తున్న సీఎండీ సంజయ్ బంగా తదితరులు

తాండూరు రూరల్: సీసీఐ సిమెంట్ దేశంలోనే నాణ్యమైందని ఆ ఫ్యాక్టరీ సీఎండీ సంజయ్ బంగా అన్నారు. మంగళవారం మండలంలోని కరన్‌కోట్ శివారులో ఉన్న సీసీఐ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. ఫ్యాక్టరీలో రూ.12 లక్షలతో ఫ్లైయాష్ హ్యాండ్లింగ్ సిస్టిమ్, రూ.10 కోట్లతో నిర్మించిన కోల్డ్‌షెడ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సిమెంట్‌లో కలిపే బొగ్గును కర్మాగార పరిసరాల్లో వర్షాకాలంలో నానకుండా ఉండేందుకు కోల్డ్‌షెడ్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. జనరల్ మేనేజర్ మహాన,హెచ్‌ఆర్ మేనేజర్ అమిత్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అనంతగిరి: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు.ఇదివరకు ఇక్కడ పని చేసిన సుదర్శన్ బదిలీ అయిన విషయం తెలి సిందే. ఆయన స్థానంలో వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ తరుపున ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో మే 1 నుంచి 6వ తేదీ వరకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తాండూరు అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 277 పోలింగ్ కేంద్రాలకు 1,276 మంది పీఓ,ఏపీఓ, ఓపీఓలను నియమించడం జరిగిందని తెలిపారు. వీరికి విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు తాండూరుకు రాజాసింగ్ రాక

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ బుధవారం తాండూరుకు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా తాండూరులో బైకు ర్యాలీ, స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో రాజాసింగ్ పాల్గొని ప్రసంగించనున్నారు.

కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా బుగ్గప్ప



దౌల్తాబాద్: కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన బుగ్గప్పను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బుగ్గప్ప నియామకంపై మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

కొడంగల్: లోకసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి అనుచరులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీ – విజిల్ మొబైల్ యాప్ లేదా కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 08505 284080కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన కారు

యువకుడికి తీవ్రగాయాలు

పూడూరు: కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామానికి చెందిన విరజానంద్(28) మన్నెగూడ నుంచి స్వగ్రామానికి బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. కండ్లపల్లి మలుపులో ఎదురుగా స్విఫ్ట్ డిజైర్ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారుడి తలకు బలమైన గాలతోపాటుగా చేయి ఫ్యాక్చర్ అయింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తికి ఫిట్స్

నీటమునిగి మృతి

యాలాల: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బెన్నూరులో మంగళవారం చోటు చేసుకుంది. యాలాల పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నర్సమ్మ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ నర్సప్ప(25) రాజన్‌కుంట చెరువులో ఉదయం చేపల వేటకు వెళ్లాడు. నీటిలోకి దిగిన తర్వాత ఆయనకు ఫిట్స్ రావడంతో నీటమునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరకుని మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. తాండూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి తల్లి దస్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తాండూరు రూరల్: వాగులో గుర్తు తెలియని మహిళ(40) మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రవంచ గ్రామ శివారులో కాగ్నానది వద్ద వెలుగు చూసింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. చంద్రవంచ వాగులో అనుమానాస్పదంగా ఓ మహిళ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతురాలి శరీరంపై ఎరుపు రంగు చీర ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారును ఢీ కొట్టిన లారీ

ఇద్దరికి గాయాలు

పరిగి: లారీ కారును ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొడంగల్ నుంచి పరిగివైపు ప్రయాణిస్తున్న కారును లక్నాపూర్ గేట్ సమీపంలోని రైస్‌మిల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పరిగి నుంచి కొడంగల్‌వైపు ప్రయాణిస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రభాకర్, సాయిశ్రీకర్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం వికారాబాద్ తీసుకెళ్లారు. ఎస్‌ఐ సంతోశ్‌ను వివరణ కోరగా కేసు నమోదు కాలేదన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కొందుర్గు: మోటర్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన చాకలి సుక్కయ్య(38) మంగళవారం కొందుర్గు మండలం లాలపేటలో బంధువుల ఇంట్లో జరిగిన విందుకు వచ్చాడు. సాయంత్రం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటకు చెందిన తన తోడల్లుడు శ్రీనుతో కలిసి తిరిగి వెళ్తుండగా తూంపల్లి శివారులో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ సంఘటనలో సుక్కయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

మామిడి మార్కెట్‌లో ఉద్రిక్తత

- వినియోగదారుల హక్కుల సంస్థ పేరుతో కొంతమంది హల్‌చల్
- వ్యాపారులు, రైతులు అడ్డుకోవడంతో గొడవ
- 15మంది ముఠా సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలింపు



వివరాలు తెలుసుకుంటున్న మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: వినియోగదారుల హక్కుల సంస్థ పేరుతో కొంతమంది ముఠా సభ్యులు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మామిడి మార్కెట్‌లో హల్‌చల్ చేశారు. మామిడి ప్యాకింగ్ చేస్తున్న కూలీలతో పాటు రైతులు, వ్యాపారులపై దౌర్జన్యానికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. మార్కెట్ శాఖ అధికారుల సమాచారంతో పోలీసులు జోక్యం చేసుకుని ముఠా సభ్యులను పీఎస్‌కు తరలించారు. దాదాపు మూడు గంటలకుపైగా కొనసాగిన వివాదానికి సంబంధించి రైతులు, వ్యాపారులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం సుమారు 15 మంది గవచ్చి మామిడి యార్డులో ప్యాకింగ్ చేస్తున్న కూలీలను అడ్డుకుని ప్యాకింగ్ చేసిన మామిడిపండ్లను తొలగించి చూపించాలని బెదిరింపులకు పాల్పడ్డారు. అక్కడున్న వారంతా ఎవరి పనుల్లో వారు నిమగ్నమైన ఉన్న సమయంలో హంగామా సృష్టిస్తుండడంతో రైతులు, వ్యాపారులంతా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసు సిబ్బంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విచారించగా.. తాము వినియోగదారులు హక్కుల సంస్థ సభ్యులమని, మామిడి ప్యాకింగ్‌లో రసాయనాలు వాడుతున్నారన్న సమాచారంతో వచ్చామని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పారు. వ్యాపారులపై దాడులకు పాల్పడ్డారని, రైతుల పనులకు విఘాతం కలిగించారని మార్కెట్ కమిటీ ఫిర్యాదుతో ముఠా సభ్యులను అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌కు తరలించారు. రసాయనాలు వాడుతున్నారనే విషయమై తెలుసుకునేందుకు ఎవరైనా ముందస్తు సమాచారం ఇస్తే ప్రతీ ప్యాకింగ్‌ను తనిఖీ చేయిస్తామని మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. అలా కాకుండా మార్కెట్‌లోకి ప్రవేశించి దాడులకు పాల్పడటం సరికాదని తెలిపారు.

పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ అవసరం

జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ



మాట్లాడుతున్న జ్యోతిపద్మ

అనంతగిరి: పిల్లల ఆరోగ్యం, మానసిక, శారీరక ఎదుగుదలపై శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో బాలల సంరక్షణ గృహాల పిల్లల స్థితిగతులపై నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు ప్రేమానురాగాలు అవసరమని.. వారిని ఇంటికి పంపిన తర్వాత వారి క్షేమ సమాచారం తెలుసుకోవాలన్నారు. వారు సంరక్షణ గృహాల్లో ఉన్నపుడు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, అభిరుచి, వ్యక్తిగత అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రతీ సంరక్షణ గృహంలో పిల్లల ఆహార పట్టిక ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలను ఆటపాటల్లో ప్రోత్సహించాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే జిల్లాలోని బాల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని బాలల సంరక్షణ గృహాలు, పనితీరు, కనీస వసతులుండాలన్నారు. హాజరైన హోం నిర్వాహకులు మేనేజర్లు వారి కేంద్రాల పనితీరు పిల్లల ఆరోగ్యం, విద్య తదితర స్థితిగతులను వివరించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు ప్రకాశ్, సంగమేశ్వర్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు, సంరక్షణ గృహాల మేనేజర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం సకాలంలో పంపిణీ చేయాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చౌక ధరల దుకాణాల ద్వారా అందజేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని ప్రజలకు సకాలంలో పంపిణీ చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ప్రజలందరికీ నాణ్యమైన ఆహారం అందించాలన్నదే కమిషన్ ధ్యేయమన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో పలు రేషన్ దుకాణాలు, హోటల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. సరుకులు పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'కారు'కు ఓటేసి కాసానిని గెలిపిద్దాం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్




ఎన్నికల ప్రచారంలో ఆనంద్

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంట్‌కు పంపాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్‌చిట్టంపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. బీసీ నాయకుడు కాసాని గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నో పథకాలు తీసుకువచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు గోపాల్, అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సంతోషనర్సింలు, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, పాండు, నర్సింలు, మల్లేశం, కిశోర్, అలీ, గిరీశ్ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆర్టీసీ ఉద్యోగి మృతి

- చెట్టుకు వేలాడుతూ కనిపించిన మృతదేహం
- ఆర్టీసీ ఉన్నతాధికారుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



సూసైడ్ లెటర్



రాజప్ప(ఫైల్)

యాలాల: ఓ ఆర్టీసీ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. యాలాల ఏఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన తూర్పు రాజప్ప(50) యాలాల మండలం దౌలాపూర్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు. హైదరాబాద్ డిపోలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఐదేళ్ల క్రితం తాండూరు డిపోకు వచ్చాడు. అనారోగ్యంగా ఉండడంతో ఆయన్ను ఉన్నతాధికారులు రివర్షన్‌లో భాగంగా మెకానిక్ విభాగానికి బదిలీ చేశారు. ఈ విషయమై కొంతకాలంగా మనోవేదన చెందుతున్నాడు. సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో తన పొలం సమీపంలోని వేప చెట్టుకుని ఉరేసుకుని కనిపించాడు. గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, కొడుకు, కూతురున్నారు. కుమారుడు శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు. కాగా ఆర్టీసీ అధికారుల వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

చర్చనీయాంశంగా సూసైడ్ లెటర్

ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ప్రదేశంలో ఉన్న కారులో మృతుడు రాసినట్లుగా భావిస్తున్న సూసైడ్ లెటర్ లభించింది. తాండూరు డిపోలో ఉన్నతాధికారులు వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో ఉంది. ఈ విషయాన్ని రూర ల్ సీఐ అశోక్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఘటనా స్థలంలో పోలీసులకు ఎలాంటి సూసైడ్ లెటర్ లభించలేదన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా రాజప్పది ఆత్మహత్యనా లేకా కుటుంబ కారణాలతో ఎవ్వైన జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం..

తాండూరు: రాజప్ప ఆత్మహత్య విషయంలో తమపై ఆరోపణలు చేయడం సరికాదని ఆర్టీసీ తాండూరు డీఎం సమత తెలిపారు. రాజప్ప ఇటీవల 12 రోజులు విధులకు గైర్హాజరైనా సంస్థ నుంచి చర్యలు తీసుకోలేదని చెప్పారు. మూడు రోజులుగా ఫోన్‌లో సంప్రదించినా స్పందన రాలేదని, ఇప్పటికే ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులే వాస్తవాలు తేలుస్తారని స్పష్టంచేశారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

- మృతదేహాన్ని పెట్రోల్‌పోసి తగులబెట్టిన దుండగులు
- క్లూస్ టీంతో వివరాలు సేకరించిన ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వరప్రసాద్

కద్దాల్: గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటన కద్దాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్తమాదారం శివారులోని ఓ వెంచర్‌లో వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. కద్దాల్–షాద్‌నగర్ ప్రధాన రహదారి సమీపంలోని ఓ వెంచర్‌లో సోమవారం రాత్రి సుమారు 40–45 ఏళ్ల ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని కొందరు దుండగులు దారుణంగా హత్య చేసి గుర్తు పట్టకుండా పెట్రోలు పోసి తగులబెట్టారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్ పోలీసు సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సాయంతో మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగిన పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి శరీరంపై బ్రౌన్ కలర్ ఎస్సా కంపనీకి చెందిన అండర్‌వేర్ ఉందని, కింది వరుస దంతాలు సందులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఏదైన పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదు అయితే 8333993536, 8712568298, 9493628100 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మక్తమాదారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు చేపట్టండి



మాట్లాడుతున్న రాహుల్‌శర్మ

అనంతగిరి: జూలైలో నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, రీజినల్ కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన విధి విధానాలను అధికారులకు సూచించారు. జిల్లా నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పోలీస్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు 6,500 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా 17 పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు. వికారాబాద్‌లో తొమ్మిది, తాండూర్ ఐదు, పరిగిలో మూడు కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేసుకోవాలని సూచించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అమరేందర్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

అనంతగిరి: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై బ్రౌన్ కలర్ షర్ట్, తెలుపు రంగు బనియన్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉంది ఎవరైన గుర్తిస్తే 8712670030లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొందుర్గు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల వాగులో నుంచి ఇసుక ఫిల్టర్ చేసి అనుమతులు లేకుండా పరిసర గ్రామాలో విక్రయిస్తున్నారని సమాచారం అందింది. దీంతో అక్కడకు వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానిపై కేసు నమోద చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయని రోగి బంధువుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య

యాచారం: మాల్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కద్దాల్ మండల పరిధిలోని సరికొండకు చెందిన గౌర పాపయ్య(50) పది రోజుల క్రితం పురుగు మందు ఆతహత్యాయత్నం చేశాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మాల్‌లోని ఓ ప్రైవట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్య బృందం చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పాపయ్య మృతికి ఆస్పత్రి యజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందకున్న యాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. దీంతో ఆందోళనను విరమించారు. అనంతరం పాపయ్య మృతదేహాన్ని ఆయన స్వగ్రామం సరికొండకు తీసుకెళ్లారు.

పథకాలపై ప్రభుత్వాన్ని నిలదీయండి

- 'కారు'కు ఓటేసి సారుకు మద్దతిద్దాం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



తాండూరు: ఎన్నికల ప్రచారంలో రోహిత్‌రెడ్డి

తాండూరు/యాలాల: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతు రుణమాఫీ, రైతుబంధు పథకాలపై నిలదీయాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బషీరాబాద్, జుంటుపల్లిలో బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ప్రమాణం చేస్తున్న ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై ఒట్టేసి చెప్పాలన్నారు. గ్యారంటీల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే గ్రామాలకు, రైతులకు ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. ఎన్నికలు రాగానే కొండా సూటు బూటు మార్చి పంచకట్టుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. ఎన్నికలు అయిపోగానే మళ్లీ ఐదేళ్లు ప్రజలకు కనిపించరన్నారు. తెలంగాణ తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుంది. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌కు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ బషీరాబాద్ మండల నాయకులు, ఇందర్‌చెడ్ రాజు, మండల వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు శ్రీశైల్‌రెడ్డి పార్టీ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

విధుల్లో చేసే సేవలతోనే గుర్తింపు



రాములు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కొడంగల్: విధినిర్వహణలో ఉద్యోగి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నిజాం అలీ, సహాయ సంక్షేమ అధికారి శ్రీధర్‌జీ అన్నారు. మండల పరిధిలోని ప ర్సాపూర్ గ్రామానికి చెందిన తట్టిపల్లి రాములు పాలెం బీసీ హాస్టల్ సంక్షేమాధికారిగా ఉద్యోగ విర మణ పొందారు. మంగళవారం ఆయనకు నాగర్‌క ర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు వార్డెన్లు, వర్కర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో దేశం అధోగతి'

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలమల్లేశ్

చేవెళ్ల: పదేళ్ల మోదీ పాలనలో దేశం అధోగతి పాలయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. బాలమల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అధ్యక్షతన అంబేడ్కర్ భవన్‌లో చేవెళ్ల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాల మల్లేశ్ మాట్లాడుతూ.. మోదీ పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలకు ఎసరుపెట్టారని విమర్శించారు. నల్లధనం తెచ్చి పేదలకు పంచుతామని ప్రగల్భాలు పలికి నిత్యావసర ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రంజిత్‌రెడ్డి ప్రజల మనిషి



బంట్వారం: మల్‌షెట్టిపల్లి తండాలో ఇంటింటి ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి

- ఆయన సతీమణి సీతారెడ్డి, తనయుడు సిద్ధార్థరెడ్డి

చేవెళ్ల: రంజిత్‌రెడ్డి ప్రజల మనిషని.. ఆయన పార్టీలకతీతంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కృషి చేశారని ఆయన సతీమణి సీతారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని ఆలూరు, అంతారం, వెంకన్నగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు నిరంతరం మీ మధ్యే ఉంటారన్నారు. చేవెళ్ల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తారన్నారు. మీరే ఆయనకు రాజకీయంగా అవకాశం కల్పించారని.. మరోసారి దీవిస్తే మీ అభ్యున్నతికి పని చేస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంగా చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డికి అవకాశం కల్పించారని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంపీ సీటును గెలిపించుకుందామన్నారు. ప్రతీ ఒక్కరు చేయి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శైలజ, సమత, సరిత, ప్రభాకర్, టేకుపల్లి శ్రీను, అనంతరాములు, నరేందర్‌చారి, రాంరెడ్డి, వెంకటేశ్‌బాబు, సుజాత, వీరేందర్‌రెడ్డి, రాములు, యాదిరెడ్డి, శ్రీశైలం, యాదమ్మ, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతాడు

బంట్వారం: లోక్‌సభ ఎన్నికల్లో మా నాన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి కోరారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ నాయక్‌తో కలిసి కంకణాలపల్లి, మల్‌షెట్టిపల్లి తండాలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతతత్వ పార్టీలను తరిమికొట్టి సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో పేదలు నిరు పేదలయ్యారని ఆరోపించారు. బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి మా నాన్నను గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, నాయకులు గిరిధర్, రామునాయక్, రమేశ్ నాయక్, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తలారి రాజు తదితరులు పాల్గొన్నారు.